క్లుప్తంగా

ఎంవీపీలో విద్యుద్దీపాల పునరుద్ధరణ



ఎంవీపీ సెక్టార్–6లో విద్యుత్ దీపాలు పునరుద్ధరిస్తున్న ఆ శాఖ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని పలు సెక్టార్లతో పాటు 20వ వార్డు చినవాల్తేర్ విద్యుత్ దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతుండడంపై 'అంతటా అంధకారం'పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి పనులు నిర్వహించారు. చినవాల్తేర్ అమ్మవారి వీధితో పాటు ఎంవీపీ సెక్టార్–3, సెక్టార్–6 శివాలయం వీధి, సెక్టార్–9 డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలో విద్యుత్ దీపాలను పునరుద్ధరించారు. కొన్ని చోట్ల ఎల్ఈడీ లైట్లను పునరుద్ధరించడంతో పాటు సోలార్ లైట్లను సైతం సరిచేశారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ సమాఖ్య సమావేశాల్లో 'నరవ'కు సత్కారం



నరవ ప్రకాశరావును సత్కరిస్తున్న జ్యోతి ఇంటర్నేషనల్ సంస్థ సభ్యులు

మద్దిలపాలెం: తమిళనాడులో తిరునెల్వేలి పట్టణంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకూ జరిగిన జాతీయ సమాఖ్య సమావేశాలకు విశాఖ నుంచి ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోని సంస్థ చైర్మన్ హోదాలో హాజరైనట్టు నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యతపై ప్రసంగించినట్టు చెప్పారు. అనంతరం మను జ్యోతి ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షుడు ఉపాసన రాజ్ తనను సత్కరించారని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఈ సమావేశాలకు 800 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

సీతమ్మధార రైతుబజారుకు సెలవు నేడు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారుకు మంగళవారం సెలవు కారణంగా బుధవారం తెరవబడుతుంది. వారం రోజుల పాటు రైతులు దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్న నేపథ్యంలో ఒక రోజు వారి కోసం సెలవు దినంగా మార్కెటింగ్ శాఖ ప్రకటించింది. చాలా మంది వినియోగదారులకు ఈ విషయం తెలియక మంగళవారం నాడు రైతు బజారుకు వస్తున్నారు. ప్రతి మంగళవారం సీతమ్మధార రైతుబజారుకు సెలవుగా అధికారులు ప్రకటించారు.

ఘనంగా భూలోకమాత తొలేళ్ల ఉత్సవం




ప్రత్యేక అలంకరణలో భూలోకమాత

మద్దిలపాలెం: కొత్త వెంకోజీ పాలెం వార్షిక ఉత్సవాలలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జరిగే వార్షిక ఉత్సవానికి ఏర్పాట్లు చేశారు.

చినుకు పడితే బితుకు బితుకు..!

- భయం గుప్పెట్లో కొండవాలు ప్రజలు
- జారి పడుతున్న కొండ చరియలు
- ఒరిగిన విద్యుత్ స్తంభాలు



బీఎస్‌ఆర్ నగర్ కొండపై పేక మేడలను తలపిస్తున్న నివాసాలు

ఆరిలోవ: కొండవాలు ప్రాంతాల ప్రజలు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండ చరియలు విరిగిపోవడం, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం వంటి ఘటనలతో బితుకు బితుకుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో ఆరిలోవ, ఆదర్శనగర్ హనుమంతవాక, పెదగదలి ప్రాంతాలలో కొండవాలు వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కొద్ది రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కొండవాలులో నివాసాల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కొండ అంచుల్లో ఉన్న నివాసాల గోడలు నానిపోతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే ఏ సమయంలో అంచులు జారిపోతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ 9 నుంచి 13వ వార్డు వరకు కొండవాలులో ఇదే పరిస్థితి నెలకొంది. 9వ వార్డులో హనుమంతవాక, క్రాంతినగర్, సంజయ్‌గాంధీ కాలనీ, సింహగిరి కాలనీ, 10వ వార్డులో ఆదర్శనగర్ ప్రాంతం సుందర్‌నగర్ కొండ, తోటగరువు దరి బీఎస్‌ఆర్ నగర్ కొండ, 11వ వార్డులో పార్వతీనగర్, 12వ వార్డులో బీటీఆర్ నగర్, బీసీ కాలనీ కొండవాలు, పెదగదిలి, చినగదిలి కొండవాలు, 13వ వార్డులో దీన్‌దయాల్‌పురం కొండవాలులో వేలాది నివాసాలున్నాయి. కొండలపైకి ఎక్కేసి నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో కొండలు కిక్కిరిసిపోతున్నాయి. ఈ క్రమంలో కొండ అంచుల్లో కూడా ఇళ్లు నిర్మించేశారు. ఇప్పుడు వర్షాలకు ఆ అంచులు కరిగిపోతున్నాయి. దీంతో ఇవి ఎప్పుడు జారిపడతాయోనని భయంతో గడుపుతున్నారు. వర్షాలు పడుతున్నప్పుడు రెవెన్యూ అధికారులు వారికి జాగ్రత్తలతో కూడిన హెచ్చరికలు జారీ చేయడం సాధారణమైన విషయంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుందర్‌నగర్ కొండవాలులో రోడ్డు అంచులు నానిపోయి రెండు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. వాటిలో పూర్తిగా ఓ స్తంభం విరిగిపోగా, మరో స్తంభం పక్కకు వాలి ఎప్పుడు ఏ ఇంటిపై కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గతంలో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకొని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



సుందర్‌నగర్ కొండవాలులో పక్కకు వాలిన మరో విద్యుత్ స్తంభం



సుందర్‌నగర్ కొండవాలులో విరిగిన విద్యుత్ స్తంభం



హనుమంతవాక కొండపై ఇళ్లు

బీఎస్‌ఆర్ నగర్

తోటగరువు దరి బీఎస్‌ఆర్ నగర్ కొండపై సుమారు 700 నివాసాలున్నాయి. వీటిలో కొన్నిచోట్ల సరైన ఆధారం లేక వర్షాకాలం వచ్చేసరికి నివాసితులు భయంతో గడుపుతున్నారు. ఏడేళ్ల క్రితం ఈ కొండపై ఓ వ్యక్తి ఇల్లు కడుతుండగా దాని గోడ కిందనున్న రెండు ఇళ్లపై కూలిపోయింది. దీంతో ఆ ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇలా ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కొండచరియలు విరిగిపడి కొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతింటున్నాయి. దీనిపై అవసరమైన చోట్ల రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

హనుమంతవాక కొండ

సింహాచలం దేవస్థానానికి చెందిన హనుమంతవాక నుంచి దీన్‌దయాల్‌పురం వరకు కొండపై వేలాది నివాసాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం కొన్ని దశాబ్దాల నుంచి ఉన్నవే. ఇక్కడ హనుమంతవాక నుంచి సంజయ్‌గాంధీ కాలనీ వరకు ప్రమాదకరమైన కొండవాలు ఉంది. వర్షాలు పడినప్పుడు ఈ ప్రాంతంలో ఎక్కువగా కొండచరియలు విరిగిపడటం, గోడలు కూలిపోవడం, వంటి ఘటనలు జరుగుతున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొన్నిచోట్ల స్వల్పంగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఎక్కడా ప్రాణాపాయం, ఆస్తి నష్టం జరగనప్పటికీ ప్రజలు గతాన్ని తలచుకొని భయపడుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం భారీ వర్షానికి కొండపై ఉండే రిటర్నింగ్ వాల్ కూలిపోయి ఓ ఇంటిలో ఉన్న వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. ఏడేళ్ల క్రితం జాతీయ రహదారి అంచున హనుమంతవాక వద్ద కొండచరియలు విరిగిపడి ఓ వృద్ధుడి కాలు విరిగిపోయింది. మరో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. నాలుగేళ్ల క్రితం హనుమంతవాక జాతీయ రహదారి వైపు కొండచరియ విరిగిపడి ఓ ఇళ్ల ధ్వంసమైంది.

సుందర్‌నగర్ కొండ

ఆదర్శనగర్ వద్ద సుందర్‌నగర్ కొండపై దశాబ్దాలుగా పలువురు పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ కూడా పేక మేడల మాదిరిగా ఇళ్లు వెలిశాయి. చిన్నపాటి వర్షానికి కూడా కొండచరియలు విరిగిపడడం, గోడలు కూలడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నాలుగేళ్ల క్రితం వర్షానికి రెండు చోట్ల ఇక్కడ గోడలు కూలిపోయాయి. మూడేళ్ల క్రితం కొండవాలులో ఆంధ్రా బ్యాంక్ పైన రోడ్డు కూలిపోవడంతో కిందనున్న రెండు రేకుల ఇళ్లు పాడైపోయాయి. ఈ నెల 19న రోడ్డు నానిపోయి రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో వర్షాలు కురుస్తే ఇక్కడ స్థానికుల్లో భయాందోళన నెలకుంటోంది.

వర్షం కురిసిస్తే భయమే..

కొండపై ఉండడంతో వర్షాలు పడుతున్న సమయంలో ఎక్కడ అంచులు జారిపోతాయోనని రాత్రి వేళ నిద్ర పట్టడం లేదు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఎప్పుడు ఎం జరుగుతుందోనని భయంతో గడుపుతున్నాం. ప్రభుత్వం స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలి.

– కె.హేమంత్‌రావు, సంజయ్‌గాంధీ కాలనీ

రక్షణ గోడలు నిర్మించాలి

కొండవాలులో తక్కువ ధరకు స్థలాలు లభిస్తున్నాయని ఆశతో కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నాం. కొన్ని చోట్ల రక్షణ గోడలు లేవు. దీంతో ఇళ్లతో పాటు రోడ్లు కిందకు జారిపోతున్నాయి. వర్షా కాలంలో ఎక్కువగా ఇళ్ల గోడలు నాని కూలిపోతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు కొండవాలు ప్రాంతాలను పరిశీలించి అవసరమైన చోట్ల రక్షణ గోడలు నిర్మించాలి.

– ఎస్.సత్యనారాయణ, బీఎస్‌ఆర్ నగర్

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఆమె పెదగదిలిలోని క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు.

స్వధర్మాచరణ, సేవతోనే మానవ జన్మ సార్థకత



వివిధ కోర్సులు పూర్తిచేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న గురుప్రసాద్, చింతలపాటి సత్యదేవ్

తాటిచెట్లపాలెం: స్వధర్మాచరణ, నిస్వార్థసేవ, దైవారాధన అనేవి మానవ జన్మ సార్థకతకు దోహదపడతాయని వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో జగద్గురు పీఠం సోదర బృందం సోమవారం నిర్వహించిన మాస్టర్ పార్వతీకుమార్ సతీమణి కృష్ణకుమారి 74వ జయంతి ఉత్సవ సభలో ఆయన మాట్లాడారు. మాస్టర్ పార్వతీకుమార్ సంకల్పంతో సంస్కృతి సదన్‌ను స్థాపించి, ఇప్పటివరకు 1,802 మంది నిరుద్యోగ మహిళలకు వివిధ వృత్తి విద్యల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్య అతిథి ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కంభంపాటి చంద్రశేఖర గురుప్రసాద్ మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె. చూపిన మార్గంలో మాస్టర్ పార్వతీకుమార్ మార్గదర్శకత్వంలో జగద్గురు పీఠం, ధనిష్టా ఫౌండేషన్ వంటి సంస్థల ద్వారా అనేక కేంద్రాల్లో, విదేశాల్లో కూడా సేవలను అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ టైలరింగ్, మెహందీల్లో శిక్షణ పొందిన 49 మంది మహిళలకు ధ్రువపత్రాలను, కొందరికి కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు.

గోధుమ పిండి టెండర్లలో అవకతవకలు

- రద్దు చేయాలని మిల్లర్ల డిమాండ్

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గోధుమ పిండి కోసం దాఖలైన షార్ట్ టెండర్లను సోమవారం రహస్యంగా తీసి, పాత వారికే కట్టబెట్టారని ఏపీ రోలర్ ఫ్లోర్ మిల్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఈ టెండర్లు దాఖలు చేసిన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం అమరావతి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ కార్యాలయంలో రహస్యంగా టెండర్లు తెరిచారని, దీని వల్ల తాము ఎంతో నష్టపోయామని అసోసియేషన్ నాయకులు విశాఖలోని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి, టెండర్ల అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో 10 కిలోల గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో సోమవారం గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్ ఫారాల్లో సోమవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ జేకే మీనా, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పలువురు లగేజీలను తనిఖీ చేసే సమయంలో రాజస్థాన్‌కు చెందిన నందకిషోర్, శ్రీరామ్ బిజార్నియాలు అక్రమంగా గంజాయిని తరలించడం గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

'కిల్కారీ'తో తల్లీబిడ్డల ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు
- కిల్కారీ వాయిస్ కాల్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ లంకపల్లి రాజు, చిత్రంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: తల్లీబిడ్డల ఆరోగ్యానికి కిల్కారీ సేవలు దోహదపడుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) కార్యాలయంలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఆశా, నోడల్ అధికారులకు సోమవారం కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ సేవలు వినియోగిస్తున్నామన్నారు. ఈ వాయిస్ కాల్స్ సేవలతో తల్లీ శిశు ఆరోగ్యానికి భద్రత కలుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేస్తూ కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ వచ్చేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందని డీఎంహెచ్‌వో వివరించారు.

స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ లంకపల్లి రాజు మాట్లాడుతూ గర్భిణిగా స్థానిక ఏఎన్ఎం దగ్గర వివరాలు నమోదు చేసుకున్న సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుందన్నారు. నాలుగు నెలల గర్భిణి నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారీ కార్యక్రమాన్ని డిజైన్ చేశారని చెప్పారు. ఈ కాల్ సమయం సుమారు 1.30 నిమిషాలు ఉంటుందని, ప్రతి గర్భిణి పూర్తిగా వినడానికి ప్రయత్నించాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసిన ప్రతి గర్భిణికి 01244451660 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందని, ఒక వేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవీఆర్ సిస్టం ఆటోమేటిక్‌గా ఒకే రోజు 3 సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందని రాజు వివరించారు. తిరిగి ఆ సందేశాన్ని వినాలి అనుకున్న వారు 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి వినవచ్చునని చెప్పారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్స్‌ని 11 మాడ్యూల్స్ ద్వారా రూపకల్పన చేశారన్నారు. 14424 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి ఆశా కార్యకర్తలు ఈ కోర్సులో జాయిన్ కావొచ్చునన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రతి గర్భిణికి అవగాహన కల్పించే దిశగా ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, డాక్టర్ బి.ఉమావతి, కె.ప్రశాంత్, ఆర్.మోహనరావు, కె.ధర్మేంద్ర, ఐ.మనోరమ, శశిభూషణ్, మణికుమారి, నాగభూషణం పాల్గొన్నారు.

ఏఎన్ 32 విమాన ప్రమాద మృతులకు నివాళి



మృతుల బ్యానర్ వద్ద నివాళులర్పిస్తున్న ఎన్ఏసీఈడబ్ల్యూ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో మెయిన్ గేటు వద్ద నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియల్ నాయకులు ఏఎన్ 32 విమాన ప్రమాదంలో మృతుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ 12 జులై 2016 న ఎన్ఏడీ ఉద్యోగులు ఏఎన్ 32 విమానంలో ప్రయాణిస్తూ 8 మంది ప్రమాదానికి గురయ్యారని గుర్తు చేశారు. మృతుల కుటుంబాలకు ఎన్ఏసీఈడబ్ల్యూ యూనియన్ అండగా నిలబడిందని తెలిపారు. అంతే కాకుండా వర్క్‌మెన్ కాంపెన్షేషన్ యాక్ట్ 1923ప్రకారం రావాల్సిన పరిహారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. అతి త్వరలో డిపార్ట్ మెంట్, రాష్ట్ర లేబర్ కమిషన్ ద్వారా అందిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం



ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం



కూలిన చెట్టు కింద నుజ్జయిన కారు

- తప్పిన పెను ప్రమాదం
- కారు, దుకాణాలు ధ్వంసం

మద్రిపాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద సోమవారం ఉదయం ఓ భారీ వృక్షం నేలకొరిగింది. అక్కడే సమీపంలో ఉన్న ఓ కారుపై, ఓ ఇంటి రక్షణ గోడపై ఆ చెట్టు కూలిపోవడంతోపాటు టీ స్టాల్, దుకాణాలు, విద్యుత్ స్తంభాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అప్పుడే టీ స్టాల్ తెరవడానికి వచ్చిన బాధితుడు ఎల్లారావు పెద్ద ప్రమాదమే తప్పిందని, ఈ ఘటనలో తన షాపు పడిపోయిందని వాపోయాడు. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై విద్యుత్ విభాగ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ ఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. కూలిన చెట్టును సోమవారం సాయంత్రానికి అధికారులు తొలగింపజేశారు.

రోడ్ల మీదే కార్ల పార్కింగ్



నిత్యం జనాలతో రద్దీగా ఉండే రహదారులు కార్ల పార్కింగ్‌తో నిండిపోతున్నాయి. రోడ్లకు సగానికి పైగా ఆక్రమించి కార్లను నిలిపి షాపింగ్‌లకు వెళ్లిపోతున్నారు. దీంతో ప్రధాన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రధానంగా ఆశీల్‌మెట్ట నుంచి సిరిపురం మధ్యలోను, జైలు రోడ్డు నుంచి దాబాగార్డెన్స్, డైమండ్ పార్క్ నుంచి ఫ్లైఓవర్ రోడ్డులో ఇష్టానుసారంగా కార్ల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది వాహనదారులను వారించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో పోలీసులు సైతం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వారిని పట్టించుకోవడం లేదు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





